

**భారత దేశంలో ప్రస్తుతం మనం వినియోగిస్తున్న వంట నూనెల దిగుబడులు సంవత్సరానికి హెక్టారుకి-పత్తి(270కిలోలు), సోయా (375కిలోలు), నువ్వులు (580కిలోలు), ప్రొద్దుతిరుగుడు పువ్వు (800కిలోలు), వేరుశనగ (890కిలోలు), కానీ సంవత్సరానికి హెక్టారుకి 4000-5000 కిలోల దిగుబడి ఇచ్చే వంట ప్రపంచంలో ఆయిల్ పామ్ ఒక్కటే. ఈ దిగుబడులను కాపాడుకోవడానికి, మరింతగా పెంచుకోవటానికి రైతులు తీసుకోవలసిన మెళకువలు ఏమిటో తెలుసా!**

# నాణ్యతతోనే మనుగడ!

## రైతు కోసం

ఆయిల్ పామ్ పరిశ్రమలో లాభనష్టాలు గెలల నాణ్యతా ప్రమాణాలపై ప్రముఖంగా ఆధారపడి ఉంటాయి. సరియైన నాణ్యతా ప్రమాణాలు గల నూనెను తీయాలంటే గెలల నాణ్యత సరియైనదిగా ఉండాలి. సరియైన పక్వదశను గుర్తించి, గెలలను కోసి, వాటి రవాణా విషయంలో తగు శ్రద్ధ వహించినప్పుడు మాత్రమే నాణ్యతమైన నూనెను ఉత్పత్తి చేయగలం.

సరియైన పక్వదశను గుర్తించి తగు సమయం లోనే గెలలను కోయాలి. మిల్లువారు అమ్మిన నూనె ధర నుండి 4 శాతం పన్ను తీసివేయగా వచ్చిన నికర ధరపై శాతాన్ని గుణించి గెలల ధరను నిర్ణయిస్తారు. నికర నూనె ధరలో 12 శాతం అనగా మిల్లులో 18.50 శాతం సగటు నూనె దిగుబడికి సమానం అని గణాంకాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

మిల్లు వారికి 18.50 శాతం కన్నా నూనె దిగుబడి తగ్గినపుడు వారి ఆదాయంలో గణనీయమైన తరుగుదల ఏర్పడడమే కాకుండా, కొన్ని సందర్భాలలో నష్టాలను చవిచూడవలసి వస్తుంది. ఫలితంగా నిర్దేశించిన గెలల ధరను ఫ్యాక్టరీ యాజమాన్యాలు చెల్లించలేక పోవచ్చు. కనుక గెలల నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అంతేకాక చెట్టు వయసును బట్టి గెలలలో నూనె దిగుబడి మారుతూ ఉంటుంది. చెట్టువయసును, గెలల నాణ్యతా ప్రమాణాలనున బట్టి నూనె దిగుబడిని ఈ క్రింది విధంగా విశదీకరించవచ్చు.

మిల్లులో నూనె దిగుబడి మరియు నాణ్యత పెంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు -

- సరిగా పక్వదశకు చేరుకున్న గెలల మాత్రమే ఎంచుకొని కోయాలి.
- కోసిన గెలలను తగురీతిలో వీలైనంత తక్కువ సమయంలో మిల్లుకుగాని, సమీప సేకరణ కేంద్రానికి గాని తరలించాలి.
- గెల కాడ 5 సెం.మీ మించి ఉండరాదు.
- గెలల కోత సమయంలో రైతు ప్రత్యేక శ్రద్ధ వహించి కేవలం కోత కోయు పనివారిపై ఆధారపడక సరియైన గెలలు కోసే విధంగా చర్యలు చేపట్టాలి.
- పరిపక్వం చెందిన గెల ఉన్న చెట్టు మొదలు వద్ద రాలిన పండ్లు గమనించి గెల పక్వ దశకు చేరిందని తెలుసుకోవాలి.
- కుళ్లిన, పాడైపోయిన, ఖాళీ గెలలను తీసివేయాలి.
- గెలల పై ఉన్న పీచు తీసివేయాలి.

| చెట్టు వయసును బట్టి నూనె దిగుబడి | | గెలల నాణ్యతా ప్రమాణాలను బట్టి నూనె దిగుబడి | |
|---|---|---|---|
| చెట్టు వయసు సంవత్సరములలో | నూనె దిగుబడి | గెలల నాణ్యత | నూనె దిగుబడి |
| 5 సంవత్సరములలోపు | 13-15% | పక్వానికి రానివి | 0% |
| 5 నుండి 7 సంవత్సరములు | 15-18% | పక్వదశలో ఉన్నవి | 10-12% |
| 7 సంవత్సరములు ఆ పైన | 18% | పరిపక్వం చెందినవి | 18% ఆపైన |

ఫ్యాక్టరీల మనుగడ పంట నాణ్యతా ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ఆయిల్‌పామ్ రైతుల భవిష్యత్తు మిల్లుల మనుగడ ఒకదాని పై మరొకటి ఆధారపడి ఉంటాయి. కాబట్టి, గెలల నాణ్యతా ప్రమాణాలపై దృష్టి సారించినపుడు ఇరుపక్షాల మనుగడ సవ్యంగా ఉండగలదు.

దేశీయంగా వంటనూనెల స్వయం సమృద్ధి సాధించడమే ఆయిల్ పామ్ సాగు ప్రారంభించడానికి గల ముఖ్య ఉద్దేశ్యం. నూనె ఉత్పత్తి సాధించాలంటే గెలల నాణ్యతా విషయంలో శ్రద్ధ వహించడం తప్పనిసరి.

**- డాక్టర్ టి. రాధ,** ఐ.ఎ.ఎస్.

